సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



..చాక్లెట్లతో భయాందోళన

గంజాయి స్మగ్లర్లు రూట్ మార్చారు. ఇన్నాళ్లు పొడి రూపంలో తరలించగా, ఇప్పుడు చాక్లెట్లుగా తయారుచేస్తున్నారు. 8లో



రహదారి మెరుగైతే రయ్ రయ్

నమ్మక్క, సారలమ్మ జాతర సమీపిస్తుండడంతో గుండాల–మేడారం రహదారికి మరమ్మతులు చేయాలని భక్తులు కోరుతున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
33° / 17°

వాతావరణం

జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉదయం, రాత్రి వేళల్లో చలిగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు స్నపన తిరుమంజనం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి బుధవారం స్నపన తిరుమంజనం జరిపారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో స్వామివారిని కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

సుజాతనగర్: మండలంలోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్ పరీక్ష ఆరో రోజు కొనసాగింది. సాంకేతిక విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం ఈ పరీక్ష జరుగుతుండగా, బుధవారం జరిగిన పరీక్షకు ఉదయం విడతలో 131 మందికి గాను 128 మంది, మధ్యాహ్నం విడతలో 129 మంది హాజరయ్యారు. రెండు విడతల్లో కలిపి ఐదుగురు గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు

ఇల్లెందు నుంచి ఏర్పాట్లు చేయాలని ఆర్‌ఎం వెంకన్న ఆదేశం



బస్ డిపోను పరిశీలిస్తున్న ఆర్‌ఎం వెంకన్న

ఇల్లెందు: ఇల్లెందు బస్టాండ్ నుంచి గుండాల మీదుగా మేడారం వరకు బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేయాలని ఆర్టీసీ ఖమ్మం రీజియన్ మేనేజర్ సీహెచ్. వెంకన్న అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఇల్లెందు బస్టాండ్, డిపోను పరిశీలించారు. ఇల్లెందు నుంచి మేడారం జాతరకు 135 ఖమ్మం డిపో బస్సులు నడిపించనున్నట్లు తెలిపారు. ఇల్లెందు నుంచి గుండాల మీదుగా మేడారానికి తొలిసారి సర్వీసులు నడుపుతున్నామని చెప్పారు. ఆయన వెంట డిప్యూటీ ఆర్‌ఎం పవిత్ర, ఇల్లెందు ఎస్టీఐ బీఎస్ రాణి, సిస్టమ్ మేనేజర్ వేమూరి నాగరాజు తదితరులు ఉన్నారు.

పంటల పరిశీలన



ఓ రైతు సాగుచేసిన వరి పొలం వద్ద డీఏఓ అభిమన్యుడు, అధికారులు

దమ్మపేట: వ్యవసాయ విస్తరణ అధికారులు, యాసంగి పంట కాలంలో నమోదు చేసిన వివరాలను జిల్లా వ్యవసాయ అధికారి కొర్సా అభిమన్యుడు బుధవారం తనిఖీ చేశారు. మండలంలోని మందలపల్లి, గాంధీనగర్‌లో ఆయన క్షేత్రస్థాయి పర్యటన చేపట్టి పంటల వివరాలు తెలుసుకున్నారు. పంట నమోదు యాప్ ద్వారా నిర్దేశించిన రైతుల పేర్లు, వారు సాగు చేస్తున్న పంటలను తనిఖీ చేశారు. కాగా, మండలంలోని ఎరువుల దుకాణాలను సహాయ వ్యవసాయ సంచాలకులు తనిఖీ చేసి, ఆన్‌లైన్‌లో నివేదికలు పంపించారు. కార్యక్రమంలో కొత్తగూడెం ప్రత్యేక సాంకేతిక అధికారి సాయి నారాయణ, మండల ఏఓ చంద్రశేఖరరెడ్డి, ఏఈఓలు దీప్తి, వినోద్, అను బాబు, రవీంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సై!



అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్.. పార్లమెంట్ ఎన్నికల్లోనూ సత్తా చాటేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాష్ట్ర మంత్రి, ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేతృత్వాన వరుస భేటీలు జరగనున్నాయి. ఈ సమావేశాలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం హాజరు కానున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రణాళిక

- ఖమ్మం స్థానంపై ప్రత్యేక దృష్టి
- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా భేటీలకు సన్నద్ధం
- మంత్రి, పార్లమెంట్ ఇన్‌చార్జి పొంగులేటి నేతృత్వంలో సమావేశాలు

సత్తా చాటేలా..

అసెంబ్లీ ఎన్నికలు ముగిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన కాంగ్రెస్.. హడావుడి ముగియగానే పార్లమెంట్ ఎన్నికలపై గురి పెట్టింది. ఈ ఎన్నికల్లో తెలంగాణ నుంచి అత్యధిక స్థానాలను గెలుచుకోవడం ద్వారా జాతీయస్థాయిలోనూ సత్తా చాటాలని యోచిస్తోంది. ఎన్నికలను ఎదుర్కొనేందుకు కేడర్‌ను సమాయత్తం చేసేలా సన్నాహక సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో విస్తరించి ఉంది. ఈ నేపథ్యాన నేతలు, కేడర్‌ను ఏకతాటిపైకి తీసుకొచ్చేలా ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలయ్యాయి.

కాంగ్రెస్‌కు అండగా..

రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్ గాలి వీచిన సమయంలోనూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని గెలుపు సాధించింది. ప్రతీ ఎన్నికల్లోనూ ఒకటి, రెండు సీట్లు మినహా.. కాంగ్రెస్, ఆ పార్టీతో జతకట్టిన పార్టీలే విజయం సాధిస్తూ వచ్చాయి. అదే తరహాలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలను కైవసం చేసుకున్నప్పటికీ 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో చుక్కెదురైంది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీచేసిన రేణుకా చౌదరి.. బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు చేతిలో ఓటమి పాలయ్యారు. దీంతో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అలాంటి తీర్పు రాకుండా ఉండేలా కాంగ్రెస్ చర్యలు చేపట్టింది. ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఆరు చోట్ల కాంగ్రెస్ పార్టీ, కొత్తగూడెంలో పొత్తుతో సీపీఐ విజయం సాధించడంతో.. లోక్‌సభ స్థానంలోనూ గెలుపు ఇక నల్లేరు మీద నడకేనని ఆ పార్టీ భావిస్తోంది.

సమావేశాలకు సన్నద్ధం

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధమయ్యేందుకు కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశాలు నిర్వహించనుంది. ఖమ్మం పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈ సమావేశాలను రాష్ట్ర మంత్రి, ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జ్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేతృత్వాన నిర్వహిస్తారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఆయనతో పాటు మంత్రులు దిశానిర్దేశం చేస్తారు. పార్టీ ఇచ్చిన హామీలు, అమలవుతున్న తీరు.. మిగతా హామీలు ఎప్పటి నుంచి అమలవుతాయనే అంశాలపై ప్రజలకు వివరించాల్సిన ఆవశ్యకతను కేడర్‌కు అవగాహన కల్పిస్తారు. అంతేకాక నియోజకవర్గాల వారీగా బలాబలాలపై సమీక్ష చేయనున్నట్లు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లా ప్రత్యేకం..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి నల్లగొండ జిల్లాలు ప్రధాన పాత్ర పోషించాయి. ఈ క్రమంలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మూడు మంత్రి పదవులు దక్కాయి. గతంలోనే బలీయమైన శక్తిగా ఉన్న కాంగ్రెస్ ఈ అసెంబ్లీ ఎన్నికలతో మరింత పట్టు సాధించినట్లయింది. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరగా పార్టీకి సంస్థాగతంగా ఉన్న పట్టుకు వారి బలం కూడా తోడు కావడంతో తిరుగులేని విజయాన్ని కైవసం చేసుకుంది. మరోవైపు మల్లు భట్టి విక్రమార్క ప్రభావం చూపించడంతో కాంగ్రెస్‌కు తిరుగులేకుండా పోయింది. ఇదే ఊపును పార్లమెంట్ ఎన్నికల్లోనూ కొనసాగించేలా చూడాల్సిన బాధ్యత ఇప్పుడు ముగ్గురు మంత్రులపై పడింది.

ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ ప్రియాంక ఆల వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానుండగా నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. పరీక్షల వివరాలను బుధవారం ఆమె వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులతో పాటు ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పరీక్షలు ఉంటాయని, నేటి నుంచి ఈనెల 15 వరకు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇందుకోసం జిల్లాలో 61 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పర్యవేక్షణకు ముగ్గురు సభ్యులతో జిల్లా పరీక్షల కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కమిటీకి జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సులోచనారాణి కన్వీనర్‌గా, మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌డీ యూసఫ్, అశ్వాపురం కళాశాల చరిత్ర లెక్చరర్ సుధాకర్‌రెడ్డి సభ్యులుగా వ్యవహరిస్తారని తెలిపారు. మొదటి సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు 2,433 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు1,935 మంది, ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు 5,843 మంది పరీక్షలకు హాజరు కానున్నారని వివరించారు. ఇంటర్ మొదటి సంవత్సరం అన్ని గ్రూపుల విద్యార్థులకు 16వ తేదీన ఆంగ్లంలో ప్రాక్టికల్ పరీక్ష ఉంటుందని తెలిపారు. విద్యార్థులతో ఆంగ్లంలో మాట్లాడించడం, చదివించడం వంటివి ఉంటాయని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పర్యావరణ విద్య పరీక్షను ఫిబ్రవరి 19న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వారు చదివే కాలేజీల్లోనే పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. 2023 – 24 విద్యా సంవత్సరానికి కంటే ముందు ఇంటర్‌లో చేరిన విద్యార్థులకు నైతికత, మానవీయ విలువల పరీక్ష ఫిబ్రవరి 17న ఉంటుందని తెలిపారు. పరీక్షలంటే ఒత్తిడి, భయం వంటి ఫోబియా ఉంటే రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేసిన 14416 లేదా 1800914416 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్‌చేసి మానసిక నిపుణుల సలహాలు, సూచనలు తీసుకునే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించిందని వివరించారు. పరీక్షల సమాచారం కోసం 9704661714, 9346913069 నంబర్లకు ఫోన్ చేయొచ్చని సూచించారు. విద్యార్థుల రవాణాకు ఇబ్బంది రాకుండా అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యుత్ అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆ శాఖ అధికారులకు సూచించారు.

సర్పంచ్‌ల నుంచి రికార్డులు స్వాధీనం చేసుకోవాలి

నేటి సాయంత్రం 5 గంటల వరకు గ్రామపంచాయితీ పాలకవర్గాల పదవీకాలం ముగుస్తున్నందున సర్పంచ్‌ల నుంచి డిజిటల్ కీ, రికార్డులు స్వాధీనం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ ఆదేశించారు. బుధవారం ఆమె ఎంపీడీఓలు, ఎంపీఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని 481 గ్రామపంచాయతీల్లో ప్రత్యేకాధికారుల నియామకానికి కసరత్తు జరుగుతోందని, గురువారం నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. నేటి సాయంత్రం 5 గంటల వరకు సర్పంచ్‌ల నుంచి రికార్డులు, డిజిటల్ కీ స్వాధీనంపై నివేదికలు అందించాలని ఎంపీడీఓలు, ఎంపీఓలకు సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు, డీపీఓ రమాకాంత్, జెడ్పీ సీఈఓ విద్యాలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షల షెడ్యూల్ తెలియజేయాలి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో గురువారం ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షల షెడ్యూల్‌ను విద్యార్థులకు తప్పనిసరిగా తెలియజేయాలని డీఐఈఓ సులోచనారాణి కళాశాలల ప్రిన్సిపాళ్లకు సూచించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్షలంటే ఒత్తిడి, భయం తొలగిపోయేలా అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఈ ఏడాది మానసిక నిపుణుల సలహాలు, సూచనలు తీసుకునే సౌలభ్యం కల్పించిందని తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్లు 14416, లేదా 1800914416 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు పొందవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రాక్టికల్ పరీక్షల నిర్వాహకులుగా ప్రభుత్వ, రెసిడెన్షియల్, ప్రైవేటు కళాశాలల లెక్చరర్లు ఉంటారని వివరించారు. పరీక్షల కోసం జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల్లో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: పెండింగ్‌లో ఉన్న కేసులు త్వరితగతిన పరిష్కరించేలా ప్రతీ అధికారి కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. జిల్లా కోర్టులోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న పోక్సో, గంజాయి కేసుల్లో అరెస్టు వారెంట్‌లు అమలు పరచాలని, అరెస్టు వారెంట్ అమలు కాకుంటే జమానత్‌దారులకు నోటీసులు ఇవ్వాలని సూచించారు. అప్పటికీ హాజరు కాకుంటే జమానత్‌దార్లను అరెస్టు చేయాలని అన్నారు. చెక్‌బౌన్స్ కేసుల్లో వారెంట్ అమలు పరచడం లేదని, ఇది పోలీసులకు సంబంధం లేనిదే అయినా కోర్టులు ఇచ్చిన వారెంట్లను అమలు పర్చాలని ఆదేశించారు. సెషన్స్ కేసుల్లో షెడ్యూల్ ఇచ్చిన ప్రకారం సాక్షులను ప్రవేశపెట్టాలని, కేసులు త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేయాలని అన్నారు. మణుగూరు కోర్టు రెనోవేషన్ పనులకు సంబంధించి అంచనాలు త్వరగా పూర్తి చేసి సమర్పించాలని చెప్పారు. సమావేశంలో మొదటి అదనపు జిల్లా జడ్జి ఎం.శ్యాంశ్రీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జి.భానుమతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు, మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎ.సుచరిత, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, రమణమూర్తి, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జేఎల్‌ఎంల ఎంపిక పరీక్ష



ఖమ్మం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన స్తంభం

ఖమ్మంవ్యవసాయం: జూనియర్ లైన్‌మెన్ల(జేఎల్‌ఎం) ఎంపిక పరీక్ష గురువారం ఖమ్మంలో నిర్వహించనున్నారు. విద్యుత్ శాఖ 2019 సంవత్సరంలో జూనియర్ లైన్‌మెన్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా దరఖాస్తు చేసుకున్న వారికి రాతపరీక్ష నిర్వహించారు. అందులో అర్హత సాధించిన వారికి దశల వారీగా పోస్టింగ్‌లు ఇస్తున్నారు. ఇప్పటికే రెండు దశల్లో అర్హులకు పోస్టింగ్ ఇచ్చి, మిగిలిన వారికి ఇవ్వకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు ఆదేశాల మేరకు మూడో విడతగా జూనియర్ లైన్లమెన్ల ఎంపికకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అర్హులైన 23 మందికి గురువారం ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఆపరేషన్స్ కార్యాలయంలో స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్ష పర్యవేక్షణ కోసం ఎన్పీడీసీఎల్ నుంచి సీఈ కిషన్ పరిశీలకులుగా, ఎస్‌ఈ ఎ.సురేందర్ చైర్మన్‌గానే కాక ఇద్దరు డీఈలతో కమిటీని నియమించారు. తొలుత అభ్యర్థుల ధృవీకరణ పత్రాలను పరిశీలించి స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహిస్తారు.

ఈజీఎస్‌కు ఇక్కట్లే!

- ఉపాధి పథకంలో సిబ్బంది లేక ఇబ్బంది
- ఈనెల నుంచి పనుల సీజన్ ప్రారంభం
- భర్తీకి నోచుకోని ఖాళీలు
- ఉపాధి హామీ పనులపై తీవ్ర ప్రభావం



ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న సిబ్బంది, పక్కన పనుల్లో నిమగ్నమైన కూలీలు

చుంచుపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో పేదల వలసలు నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. పనుల నిర్వహణను పరిశీలించేందుకు మొదట్లో ప్రతీ పంచాయతీకి ఒక ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించింది. అయితే కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లో ఎఫ్‌ఏలతో పాటు ఇతర సిబ్బంది లేక సీజన్‌లో కూడా తగిన పనిదినాలు దొరకక కూలీలు ఇబ్బంది పడుతున్నారు. ఇక సిబ్బంది కొరతతో కార్యదర్శులు, సీనియర్ మేట్లపై పని భారం పడుతోంది. ఫలితంగా పనులు చూపించడంలోనూ జాప్యం జరుగుతోంది. ఉపాధి పనుల కల్పన, పర్యవేక్షణ, కొలతల నిర్వహణ, ఆన్‌లైన్‌లో కూలీల వివరాల నమోదు, బిల్లుల చెల్లింపు వంటి అదనపు పనులతో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్‌లో ఉన్న అరకొర సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఇక కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లో ఐదేళ్లుగా సరైన ఉపాధి సిబ్బంది నియామకాలు సైతం చేపట్టకపోవడంతో పంచాయతీ కార్యదర్శుల బాధలు వర్ణనాతీతంగా మారాయి.

17 విభాగాల్లో పనులు

ఉపాధి హామీ పథకంలో 17 విభాగాల్లో 250 పైగా పనులు చేపట్టే అవకాశం ఉంది. అయితే స్థానిక పరిస్థితులను బట్టి అధికారులు పనులు ఎంపిక చేస్తారు. ముఖ్యంగా పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు, ఇంకుడు గుంతలు, వ్యవసాయ, చిన్ననీటి కుంటలు, చెక్ డ్యామ్‌ల నిర్మాణం, కాలువల పూడికతీత, పశువుల పాకలు, పశుగ్రాసం, పండ్ల తోటల పెంపకం, పొలం గట్లపై టేకు చెట్లు, బంజరు భూములను సాగుకు యోగ్యంగా మార్చడం వంటి పనులు ఉన్నాయి. ఇక సామాజిక పనులైన సీసీ, మట్టిరోడ్లు, శ్మశాన వాటికల అభివృద్ధి, హరిత నర్సరీల నిర్వహణ, హరిత హారంలో నాటిన మొక్కల పెంపకం వంటివి చేపడతారు. ఉపాధి హామీ పనులను మండలాల్లో ఏపీఓ, ఈసీ, టీఏలు చూసుకుంటారు. జిల్లా స్థాయిలో డీఆర్‌డీఓతో పాటు ఒక అదనపు పీడీ, ఇద్దరు ఏపీడీలు ప్రత్యేకంగా పనిచేస్తారు. రోజువారీ పనులకు వచ్చే కూలీలకు చెల్లింపులు, సమన్వయం చేయడం, పరిపాలన వ్యవహారం చూసుకోవడం వంటి బాధ్యతలను ఏపీఓలు నిర్వహిస్తుంటారు. టీఏలు పనికి వచ్చే కూలీలతో కొలతల ప్రకారం పని చేయిస్తారు. చేసిన పనిని లెక్కించి పుస్తకాల్లో నమోదు చేస్తారు. ప్రస్తుతం ఆయా పోస్టుల్లో సగం మంది మాత్రమే పనిచేస్తుండడంతో ఇతర గ్రామాలు, మండలాల బాధ్యతలు కూడా వీరిపైనే పడుతున్నాయి. అటు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించే ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత భారీగా ఉంది. గతంలో ఉన్న పాత గ్రామపంచాయతీల లెక్క ప్రకారమే ఇప్పటికీ ఫీల్డ్ అసిస్టెంట్లు కొనసాగుతున్నారు. కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లో ఎఫ్‌ఏలను నియమించాల్సి ఉంది. ప్రస్తుత సిబ్బంది ఒక్కొక్కరు రెండు, మూడు మండలాలు, గ్రామాల బాధ్యతలు చూడాల్సి వస్తోంది. ఫిబ్రవరి రెండో వారం నుంచి జూన్ వరకు ఉపాధిహామీ పనులు జోరుగా సాగుతుంటాయి. గతేడాది వేసవి సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో సుమారు 5 లక్షల మందికిపైగా కూలీలు ఉపాధి పనులను వినియోగించుకున్నారు.

ఉమ్మడి జిల్లా వివరాలిలా..

	భద్రాద్రి జిల్లా	ఖమ్మం జిల్లా
గ్రామీణ మండలాలు	22	20
పాత పంచాయతీలు	205	427
కొత్త పంచాయతీలు	276	162
ప్రస్తుతం ఉన్న ఏపీఓలు	10	20
ప్రస్తుతం ఉన్న ఈసీలు	08	15
ప్రస్తుతం ఉన్న ఎఫ్‌ఏలు	232	357
ప్రస్తుతం ఉన్న టీఏలు	114	76
యాక్టివ్ జాబ్ కార్డులు	1.34లక్షలు	1.88 లక్షలు
యాక్టివ్ కూలీలు	2.30లక్షలు	3.17లక్షలు

ఖాళీలు ఇలా..

ఉమ్మడి జిల్లాలో 1,070 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇందులో భద్రాద్రి జిల్లాలో 481 పంచాయతీలకు 1.34 లక్షల మందికి జాబ్ కార్డులు ఉండగా, వాటి పరిధిలో 2.30 లక్షల మంది పనులకు వస్తుంటారు. ఇక 22 మంది ఏపీఓలకు 9 మంది మాత్రమే ఉన్నారు. ఈసీలు 22 మందికి 8 మంది పనిచేస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు 481 పంచాయతీలకు 232 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు సైతం 114 మంది మాత్రమే ఉన్నారు. ఖమ్మం జిల్లాలో 1.88 లక్షల జాబ్ కార్డుల పరిధిలో 3.17 లక్షల మంది కూలీలు ఉన్నారు. ఏపీఓలు 20 మంది, ఈసీలు 20 మందికి 15 మంది పనిచేస్తున్నారు. 589 పంచాయతీలకు 357 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు మాత్రమే విధుల్లో ఉన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు సైతం 76 మందే ఉన్నారు.

ఐదు నుంచి ఆరు గ్రామాల బాధ్యతలు



చుంచుపల్లి మండల పరిధిలో మొత్తం 18 గ్రామపంచాయతీలు ఉండగా, కేవలం ముగ్గురు టెక్నికల్ అసిస్టెంట్లు మాత్రమే పనిచేస్తున్నాం. ఒక్కొక్కరు 5, 6 గ్రామపంచాయతీల బాధ్యతలు చూడాల్సి వస్తోంది. రోజువారీ వచ్చే ఉపాధి కూలీల హాజరు నుంచి కొలతల వరకు అన్ని రకాలా పర్యవేక్షిస్తుంటాం. దీంతో కూలీలకు సరైన సమయంలో పనులు కల్పించలేకపోతున్నాం. ప్రభుత్వం కొంతమేర సిబ్బందిని నియమిస్తే బాగుంటుంది.

– పిల్లి నాగరాజు, టీఏ

పని భారంతో సతమతం



ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లు కీలకంగా వ్యవహరిస్తాం. కూలీలను పనులకు రప్పించడంతో పాటు పనుల పర్యవేక్షణ బాధ్యతలు ఉంటాయి. ప్రస్తుతం గ్రామ పంచాయతీలకు తగ్గట్టు ఫీల్డ్ అసిస్టెంట్లు లేరు. ప్రభుత్వం గతంలో పాత గ్రామ పంచాయతీల పరిధిలో పనిచేసిన వారినే కొత్త పంచాయతీలకు సైతం వినియోగిస్తుంది. దీంతో అదనపు పనిభారంతో నిత్యం సతమతమవుతున్నాం.

– బానోతు కేస్లీ, ఫీల్డ్ అసిస్టెంట్

అటవీ భూమికి రక్షణ చర్యలు

సరిహద్దులో కందకం ఏర్పాటు



దివ్యాంగుల కాలనీ వద్ద అటవీ భూమికి కందకం తీసే పనులు చేస్తున్న ఫారెస్ట్ సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: చాలా కాలానికి అటవీ భూముల రక్షణకు బుధవారం ఫారెస్ట్ అధికారులు చర్యలు చేపట్టారు. అశ్వారావుపేట సమీపంలోని దివ్యాంగుల కాలనీ వద్ద కంపార్ట్‌మెంట్ నంబరు 295లో ఉన్న ఫారెస్టు భూమిలో గతంలో కొంతమేర భూమిని నిరుపేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించి, హక్కు పట్టాలు సైతం అందించారు. ఆయా స్థలాల్లో పేదలు ఇళ్ల నిర్మించుకుని స్థిర నివాసం ఉంటున్నారు. ఇప్పుడా స్థలాల విలువ భారీగా పెరిగిన నేపథ్యంలో కొందరు వ్యక్తులు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. దీంతో అప్రమత్తమైన ఫారెస్ట్ అధికారులు జేసీబీతో ఫారెస్టు భూమికి సరిహద్దుగా అశ్వారావుపేట, దమ్మపేట ఫారెస్ట్ రేంజ్ సిబ్బంది పహారాలో కందకాలు తవ్వించే పనులు చేపట్టారు. లైన్ ఆఫ్ కంట్రోల్ విధానంలో సరిహద్దు నిర్ధారించి రక్షణ చర్యల్లో భాగంగా ట్రెంచ్(కందకం) తీయిస్తున్నట్లు ఫారెస్ట్ రేంజర్ ఎం.మురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌వోలు అరుణ్, రమేష్, సంపత్, శ్రీను, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రిటైర్డు ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

● వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



రిటైర్డ్ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ తెలిపారు. తెలంగాణ రిటైర్డు ఉద్యోగుల సంఘం సమావేశం బుధవారం వైరాలో నిర్వహించగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సహకారంతోనే తమ ప్రభుత్వం ఏర్పడిందని.. వారి సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం బాధ్యులు పి.సత్యనారాయణ, సుబ్బయ్య, టీవీ కృష్ణయ్య, పైడిపల్లి శరత్‌బాబు, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, ఎస్‌టీఓ యాలాద్రి, ఎస్‌బీఐ మేనేజర్ హన్మంతునాయక్‌తో పాటు బొర్రా రాజశేఖర్, పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, వైరా టౌన్ పూల వ్యాపారుల సంఘం బాధ్యులు ఎమ్మెల్యేను సన్మానించి తమ సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని విన్నవించారు. నాయకులు దార్న రాజశేఖర్, అన్సర్, జీవన్ పాల్గొన్నారు

కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం

కామేపల్లి: కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్ తీర్థాల చిదంబరరావుపై అవిశ్వాసం కోరుతూ 12 మంది సొసైటీ డైరెక్టర్లు నోటీస్ అందజేశారు. ఖమ్మంలో బుధవారం వారు జిల్లా సహకార శాఖ అధికారి విజయకుమారికి లేఖ అందజేసి మాట్లాడారు. కాగా, పీఏసీఎస్‌లో మొత్తం 13 మంది డైరెక్టర్లకు గాను 12 మంది చైర్మన్‌పై తిరుగుబావుటా ఎగురవేయడం గమనార్హం. కార్యక్రమంలో డైరెక్టర్లు పుచ్చకాయల వీరభద్రం, ముకలపల్లి కరుణ, దేవండ్ల యాదగిరి, సకినాల పద్మ, దొంగల వెంకటనరసమ్మ, తుమ్మలపల్లి వీరయ్య, హట్కర్ లక్ష్మి, పింగళి నాగభూషణం, భూక్యా జైత్రాం, భట్టు పెట్యా, గుజ్జర్లపూడి రాంబాబు పాల్గొన్నారు. కాగా, చైర్మన్ బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు కాగా, అవిశ్వాసం ప్రకటించిన 12మందిలో ఐదుగురు సైతం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులే కావడం గమనార్హం.

యువకుడి ఆత్మహత్య

ములకలపల్లి : తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెంది ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మంగపేట గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. మంగపేట గ్రామానికి చెందిన ఊకే వీరభద్రం (35) తల్లిదండ్రులు సీతమ్మ, రాములుతో కలిసి జీవిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసైన వీరభద్రం పనికి వెళ్లకుండా ఇంటివద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం తల్లిదండ్రులు మందలించగా పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు గమనించి పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజమౌళి తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

అశ్వారావుపేటరూరల్: పార్కింగ్ చేసి ఉన్న ఓ ద్విచక్రవాహనం బుధవారం చోరీకి గురైంది. బాధితుడి కథనం ప్రకారం..అశ్వారావుపేటకు చెందిన ఎస్‌కే అజీమ్ తన ద్విచక్రవాహనాన్ని గాంధీబొమ్మ సెంటర్‌లో ఉన్న పాల కేంద్రం వద్ద మంగళవారం రాత్రి పార్కింగ్ చేశారు. తెల్లవారే సరికి పార్కింగ్ చేసిన వాహనాన్ని గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయారు. పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పాల్వంచరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలోని శ్రీనివాసకాలనీ వద్దగల మొర్రేడు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తుండగా దమ్మపేట సెంటర్ వద్ద పట్టణ ఎస్‌ఐ రాము పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ గోగుల శ్రీను, ట్రాక్టర్ యజమాని దుర్గాప్రసాద్‌లపై కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో చెరకు కూలీ మృతి

నేలకొండపల్లి: పొట్టకూటి కోసం చెరకు కూలీ పనులకు వచ్చిన వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఏపీలోని కాకినాడ జిల్లా సింగారానికి చెందిన సత్తిబాబు(50) తన బంధువులతో కలిసి షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో చెరకు నరికేందుకు వచ్చాడు. అమ్మగూడెంలోని ఓ రైతు ఇంటి వద్ద బుధవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైన ఆయన కుప్పకూలగా సహచర కూలీలు నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే సత్తిబాబు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించగా.. అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామానికి తరలించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,448

గంజాయి చాక్లెట్లతో భయాందోళన

● ఆందోళనకు గురవుతున్న తల్లిదండ్రులు
● గతంలో యువతను లక్ష్యంగా చేసుకున్న స్మగ్లర్లు
● ప్రస్తుతం రూటు మార్చి చిన్నారులనూ టార్గెట్
● మత్తుతో పిల్లల ప్రాణాలకు ముప్పు అంటున్న వైద్యులు
● పోలీసులు మరింత నిఘా పెట్టాలని పలువురి విన్నపం



ఖమ్మం పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్ ప్యాకెట్లు

కొత్తగూడెంటౌన్: చిన్నపిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న తల్లిదండ్రులను గంజాయి చాక్లెట్లు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇప్పటివరకు సిగరెట్, బీడీల ద్వారా, హుక్కా, ఆవిరి రూపంలో గంజాయి తీసుకునేవారు. మధ్య వయస్కులు, ముఖ్యంగా యువతను టార్గెట్ చేసి గంజాయి విక్రయించేవారు. కానీ స్మగ్లర్లు రూట్ మార్చి ఇప్పుడు చిన్నారులను టార్గెట్‌గా చేస్తున్నారు. గంజాయి చాక్లెట్లు తయారు చేసి విక్రయిస్తూ చిన్నారుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి మహా నగరాల్లోని ప్రాంతాలకు పరిమితమైన గంజాయి చాక్లెట్ దందా ఇప్పుడు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వ్యాపించింది. గంజాయితో తయారు చేసిన చాక్లెట్లను తరలిస్తూ ఖమ్మంలో నిందితులు పట్టుబడటం తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. అవి తింటే ప్రాణాంతకం అవుతుందని వాపోతున్నారు.

జిల్లా మీదుగా నిత్యం రవాణా

మొన్న హైదరాబాద్ నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలోని కోకాపేట ప్రాంతంలో, మంగళవారం ఖమ్మంలో గంజాయి చాక్లెట్లను పోలీసులు పట్టుకున్నారు. ఇక జిల్లా మీదుగా నిత్యం గంజాయి రవాణా అవుతోంది. రోజూ ఎక్కడో ఓ చోట గంజాయి రవాణా చేస్తూ పలువురు పట్టుబడుతూనే ఉన్నారు. జిల్లా కేంద్రంలో కూడా పలువురు యువకులు గంజాయి బారిన పడుతున్నారు. కొత్తగూడెంలోని రుద్రంపూర్ ప్రభుత్వ ఐటీఐ పరిసర ప్రాంతాల్లో, రుద్రంపూర్ శివారు ప్రాంతాల్లో, రామవరం క్లబ్ ఏరియాల్లో, రైటర్‌బస్తీ న్యూగొల్లగూడెంలో, హనుమాన్‌బస్తీ శివారు ప్రాంతాల్లో, నాగయ్యగడ్డ బస్తీ శివారు ప్రాంతాల్లో, గరిమెళ్లపాడు, పాత కొత్తగూడెం శివారు ప్రాంతాల్లో, పాలకేంద్రం, విద్యానగర్ కాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీ, బైపాస్‌రోడ్డు, హనుమాన్‌బస్తీ, రామవరం, హెడ్ ఆఫీస్ ఏరియాలోని బాబుక్యాంప్, బర్మాక్యాంప్, రామాంజనేయ కాలనీల్లో యువత గంజాయి మత్తులో గొడవలకు దిగిన సంఘటనలు సైతం ఉన్నాయి. 2021లో త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి మత్తులో కొందరు దంపతులపై దాడికి యత్నించారు. ఠాణాకు తరలిస్తే అక్కడా వీరంగం సృష్టించారు. రుద్రంపూర్‌లో ఓ సేల్స్‌మెన్ గంజాయి మత్తులో వ్యక్తితో గొడవ పడి అతడి మర్మాంగాన్ని కోసివేశాడు. 2023లో కొత్తగూడెం రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి మత్తులో ఓ వ్యక్తిని హతమార్చారు.

పటిష్ట నిఘాతోనే..

గంజాయి రవాణాను అడ్డుకునేందుకు పోలీసులు గట్టి నిఘా పెట్టారు. అయినా కొందరు పోలీసులు కళ్లుగప్పి జిల్లా మీదుగా గంజాయి తరలించుకుపోతున్నారు. జిల్లాలో విక్రయాలు కూడా చేపడుతున్నారు. ప్రస్తుతం గంజాయి చాక్లెట్లు కూడా వస్తుండటంతో కళాశాలలు, పాఠశాలలు, మార్కెట్లలోని చాక్లెట్ల దుకాణాల వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

గతంలో యువతే లక్ష్యంగా గంజాయి విక్రయాలు సాగాయి. పలువురు మత్తు బారిన పడి ఆర్థికంగా, శారీరకంగా నష్టపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఇటీవల కొంత కాలంగా పదో తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు స్మగ్లర్లు గంజాయి విక్రయించి మత్తుకు అలవాటు చేస్తున్నారు. ప్రస్తుతం చాక్లెట్లలో కూడా గంజాయి ఉంటుండటంతో సాధ్యమైనంత వరకు పిల్లలకు బయట చాక్లెట్లను కొనివ్వకపోవడమే మేలని వైద్య నిపుణులు చెబుతున్నారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి చిన్నారులను కాపాడుకోవాలని సూచిస్తున్నారు.

పిల్లల ప్రాణాలకు ముప్పు



గంజాయి కలిపిన చాక్లెట్లు తింటే పిల్లల్లో క్రమంగా జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది. చివరకు మతి స్థిమితం కోల్పోతారు. చిన్నపిల్లలపై మరింతగా ప్రభావం చూపుతుంది. మానసికంగా కంట్రోల్ తప్పుతారు. గంజాయిలో టెట్రాహైడ్రోకెనాసిస్ అనే మత్తు పదార్థం ఉంటుంది. దీనివల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుంది. నరాల వీక్‌నెస్‌తోపాటు కంటి చూపు కోల్పోవడం, గుండె వేగంగా కొట్టుకోవడం, గాబరా కావడం, నీరసంగా ఉండటం, మానసిక స్థితి ఆందోళనకరంగా ఉండటం, మెదడుపై ప్రభావం చూపడం, మానసిక రుగ్మతలు వంటి సమస్యలు వస్తాయి. గంజాయి తీసుకోవడం వల్ల వ్యక్తి విచక్షణ కోల్పోతాడు. యువతలో మానసిక, లైంగిక సామర్థ్యంపై కూడా ప్రభావం పడుతుంది. చిన్నారుల సోషల్ బిహేవియర్‌ను గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించి ఆరోగ్యాన్ని కాపాడాల్సి వస్తుంది. యువతకు కూడా కౌన్సెలింగ్ ఇస్తూ, మెడికల్ డీ అడిక్షన్ ద్వారా మత్తు వ్యసనాలకు దూరం చేసే అవకాశం ఉంది.

– డాక్టర్ బాబూరావు, ఎండీ, చెస్ట్ అండ్ క్రిటికల్ కేర్ స్పెషలిస్టు

కఠిన చర్యలు తీసుకుంటాం



గంజాయి మహమ్మారి నుంచి పిల్లలను రక్షించుకోవాలంటే పోలీసులతోపాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా వారి కదలికలపై నిఘా ఉంచాలి. అపరిచిత వ్యక్తులు తినుబండారాలు ఇస్తే తీసుకోవద్దని ఇంటి వద్ద చెప్పాలి. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల రాకపోకలను గమనించాలి. ప్రవర్తనలో మార్పు వస్తే అడిగి తెలుసుకోవాలి. అనుమానిత వ్యక్తులు కనపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. గంజాయిని విక్రయించినా, తరలించినా తీవ్రమైన చర్యలు తీసుకుంటాం. కఠిన శిక్షలు పడుతాయి. ఇప్పటికే గంజాయి రవాణాను అడ్డుకునేందుకు పటిష్ట నిఘాను ఉంచాం. భద్రాచలం ఆవల ఉన్న అటవీ ప్రాంతాలు గంజాయి సాగుకు, రవాణాకు అనుకూలంగా ఉన్నాయి. నిఘాను మరింత పటిష్టం చేసి గంజాయి రవాణాను అరికడతాం. మత్తు బారిన పడకుండా యువతకు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

– అబ్దుల్ రెహమాన్, కొత్తగూడెం డీఎస్పీ

వినతులు పెండింగ్ ఉండొద్దు

● ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించండి
● ప్రజా దర్బార్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కూసుమంచి : క్యాంపు కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఖమ్మం రూరల్ : తమ్మినేని కృష్ణయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి

కూసుమంచి: ప్రజలు విన్నవించే సమస్యలను పెండింగ్‌లో పెట్టకుండా పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులు ఆదేశించారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన ప్రజల నుండి వినతులు స్వీకరించారు. నేలకొండపల్లి మండలం చెరువుమాధారానికి చెందిన రైతులు 110 ఎకరాల్లో వరి విత్తనాలు వేయగా 60 రోజుల్లోనే కంకులు వచ్చి నష్టపోయామని విన్నవించగా విచారణ చేపట్టి కంపెనీపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని డీఏఓ విజయనిర్మలను ఆదేశించారు. అలాగే, రాజుపేట వద్ద నిర్మించిన చెక్‌డ్యాంను సాగర్ నీటితో నింపాలని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రేలా వెంకటరెడ్డి వినతిపత్రం అందజేశారు. అధికారులు విచారణ చేపట్టకుండా ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీచేశారని నేలకొండపల్లి మండలం నాచేపల్లికి చెందిన మల్లెల వెంకటాచారి ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టాలని సూచించారు. ఆతర్వాత మంత్రి మాట్లాడుతూ రాజుపేటలోని ఖబరస్తాన్‌కు ప్రహరీ నిర్మించి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ భూముల కబ్జాపై సర్వే చేయాలని సూచించారు. మహాశివరాత్రి సందర్భంగా తీర్థాల, కూసుమంచి ఆలయాలకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. తొలుత మంత్రి పొంగులేటి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులతో పాటు విద్యుత్ శాఖ నుండి మంజూరైన బీమా చెక్కులను అందజేశారు. అనంతరం కూసుమంచి మండలం ధర్మాతండాకు చెందిన విద్యార్థి జర్పుల సింధు రోడ్డు ప్రమాదంలో గాయపడిన కోమాలోకి వెళ్లగా మంత్రి పరామర్శించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో 24 గంటల వైద్యసేవలు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో 24 గంటల పాటు వైద్యం అందేలా తమ ప్రభుత్వం కృషిచేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచిలో హోమియో ఆస్పత్రి భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం లింగారంతండాలో జీపీ భవనం, పలుచోట్ల రహదారి నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్డీఓ గణేష్, జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి శ్రీరాం, ఆర్అండ్‌బీ ఈఈ శ్యాంప్రసాద్, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన, మత్స్యశాఖ ఏడీ ఆంజనేయస్వామితో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు వాణిశ్రీ, డాక్టర్ రాములు, ఉమామహేశ్వరరావు, బానోత్ శ్రీనివాస్‌నాయక్, మోహన్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు మాదాసు ఉపేందర్, జూకూరి గోపాలరావు పాల్గొన్నారు. కాగా, కూసుమంచిలో రహదారి పక్కన ఉన్న ఓ టీ స్టాల్ వద్ద కాన్వాయ్ నిలిపిన మంత్రి టీ తాగాక నిర్వాహకుడు అనిల్‌తో మాట్లాడి వ్యాపారంపై ఆరా తీశారు.

తమ్మినేని కృష్ణయ్యకు నివాళి

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లిలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం గతంలో హత్యకు గురైన నాయకుడు తమ్మినేని కృష్ణయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు రాయల నాగేశ్వరరావు, తమ్మినేని నవీన్, తమ్మినేని మంగతాయారు పాల్గొన్నారు.

దమ్మపేట సొసైటీ చైర్మన్ రాజీనామా

అవిశ్వాస సమావేశానికి వారం క్రితం నోటీసులు జారీ చేసిన అధికారులు



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ రావు జోగేశ్వరరావు

దమ్మపేట: తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు దమ్మపేట కోపరేటివ్ సొసైటీ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు రావు జోగేశ్వరరావు తెలిపారు. బుధవారం దమ్మపేట సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యక్తిగత కారణాలతో చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. తన హయాంలో సొసైటీ టర్నోవర్ రూ.11.43 కోట్ల నుంచి రూ.15.18 కోట్లకు పెరిగిందన్నారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ద్వారా సొసైటీకి రూ.30 లక్షల కమీషన్ వచ్చిందన్నారు. తొలుత సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే అవిశ్వాసాల ప్రభుత్వంగా పేరు తెచ్చుకుందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు పలుచోట్ల అవిశ్వాస, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాగా, ఈ నెల 2న ఇదే చైర్మన్‌పై అవిశ్వాస సమావేశానికి జిల్లా కోపరేటివ్ అధికారులు నోటీసులు అంజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దారా యుగంధర్, దారా మల్లిఖార్జునరావు, దొడ్డా రమేష్, సోయం వీరభద్రం, జలగం వాసు, అడపా బుజ్జియ్య, రావుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మణుగూరు రూరల్ : మండల పరిధిలోని మణుగూరు రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మణుగూరు ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. చెరువులో మృతదేహం తేలి ఉన్నట్లు గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్‌ఐ, సిబ్బంది అక్కడకు వెళ్లి మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడు చనిపోయిన సుమారు 15రోజులు అయి ఉంటుందని, మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో ఉందని ఎస్‌ఐ తెలిపారు.

మృతుడు నీలి రంగు షర్ట్, జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, వివరాలు తెలిస్తే సమాచారం అందించాలని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

చెట్ల నరికివేతపై నామమాత్రంగా విచారణ

● ఎనిమిది దుంగల్లో అధికారులు సీజ్ చేసింది మూడింటినే..
● ఐదు దుంగలను ఇంకో స్థావరానికి తరలింపు!
● వైల్డ్‌లైఫ్ శాఖ ఉద్యోగి కనుసన్నల్లోనే కలప దందా



వైల్డ్‌లైఫ్ అధికారులు టింబర్ డిపోకు తరలించిన మూడు దుంగలు



మరో స్థావరానికి తరలించిన కలప దుంగ

అశ్వాపురం: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ పాలవాగు గ్రామంలో ఉన్న పాల్వంచ వైల్డ్‌లైఫ్ పరిధి చెట్లు నరికి కలప అక్రమంగా తరలించిన వ్యవహారంపై అటవీశాఖ అధికారులు బుధవారం నామమాత్రంగా విచారణ చేపట్టారు. ఈ నెల 31న 'వైల్డ్‌లైఫ్ ఏరియాలో చెట్లు నరికివేత శీర్షికన' సాక్షిలో కథనం ప్రచురితం కాగా, గ్రామ సమీపంలో చెట్లు నరికి దాచిపెట్టిన కలప స్థావరం వద్ద అధికారులు విచారణ జరిపారు. మూడు కలప దుంగలను పాల్వంచ టింబర్ డిపోకు తరలించి కేసు నమోదు చేశారు. ఈ నెల 30న సుమారు రూ. లక్ష విలువైన ఎనిమిది కలప దుంగలు ఉండగా, మూడు మాత్రమే అధికారులు గుర్తించి టింబర్ డిపోకు తరలించారు. మిగతా ఐదు అక్కడి నుంచి తరలించి మరో స్థావరంలో దాచిఉంచినట్టు సమాచారం. వైల్డ్‌లైఫ్ శాఖలో వాచర్‌గా పని చేస్తున్న ఓ వ్యక్తి కనుసన్నల్లోనే చెట్లు నరికివేత, కలప అక్రమంగా తరలింపు వ్యవహారం సాగుతోందని స్థానిక గిరిజనులు ఆరోపిస్తున్నారు. అయినా అధికారులు స్థానికులను విచారించకుండా తూతూమంత్రంగా చర్యలు తీసుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైల్డ్‌లైఫ్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చెట్లు నరికివేత, కలప అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

25 కిలోల గంజాయి స్వాధీనం

బూర్గంపాడు: మండల పరిధిలోని మణుగూరు క్రాస్‌రోడ్డులో బుధవారం పోలీసులు 25 కిలోల గంజాయిని పట్టుకున్నారు. వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఓ కారు, దాని వెనుక బైక్ ఆగకుండా వెళ్లాయి. పోలీసులు వెంబడించి పట్టుకుని తనిఖీ చేయగా, కారులో సుమారు 25 కిలోల గంజాయి లభించింది. గంజాయితో పాటు కారు, మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టామని బూర్గంపాడు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: పోలీస్ స్టేషన్ ఎదురుగా బుధవారం ఎస్‌ఐ జీవన్‌రాజు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో భద్రాచలం నుంచి హైదరాబాద్ వెళుతున్న ఆర్టీసీ బస్సు డిక్కీలో రెండు లగేజీ బ్యాగ్‌ల్లో తరలిస్తున్న సుమారు 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ప్రయాణికుల్లోని ఒక అనుమానితుడ్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా వివరాలు వెల్లడించేందుకు పోలీసులు విముఖత వ్యక్తం చేశారు.

ఆటో బోల్తా: కూలీలకు గాయాలు



పల్టీ కొట్టిన ఆటో

కరకగూడెం: కూలీలతో వస్తున్న ఓ ఆటో పల్టీ కొట్టిన సంఘటన బుధవారం జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. తుమ్మలగూడెం, అనంతారం గ్రామాలకు చెందిన సుమారు ఎనిమిది మంది కూలీలు పద్మాపురం వైపు వరి నాట్లు వేసేందుకు వస్తున్నారు. ఈ క్రమంలో అనంతారం గ్రామ శివారులో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను వేరే ఆటోల్లో కరకగూడెం పీహెచ్‌సీ తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి 108 అంబులెన్స్ ద్వారా మణుగూరు 100పడకల ఆస్పత్రికి తీసుకెళ్లారు.

అమాయకుడిని కాల్చి చంపారు..

● పోలీసులపై ఆదివాసీల ఆరోపణ, మృతదేహంతో ఆందోళన
● ఎనిమిది రోజుల బిడ్డతో మృతుడి భార్య నిరసన



పోలీసు కాల్పుల్లో మృతి చెందిన సోయం రమేష్ మృతదేహం



మృతదేహం వద్ద పసిబిడ్డతో ఆందోళన చేస్తున్న మృతుడి భార్య

చర్ల: ఇంట్లో జరిగే శుభకార్యానికి చికెన్ తీసుకొచ్చేందుకు వెళ్లిన వ్యక్తిని పోలీసులు కాల్చి చంపారని ఆరోపిస్తూ బుధవారం ఆదివాసీలు మృతదేహంతో ఆందోళన చేపట్టారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా బోడ్గా గ్రామానికి చెందిన సోయం రమేష్ మంగళవారం తమ ఇంట్లో జరిగే శుభకార్యానికి చికెన్ తెచ్చేందుకు మరో గ్రామం వెళ్లాడు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా, బైరంగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాడ్ సమీపంలో ఉన్న ఉతాలాలో రమేష్ మృతదేహం ఉన్నట్లు సమాచారం తెలిసింది. దీంతో అక్కడికి వెళ్లి మృతదేహాన్ని బట్వారా అనే గ్రామానికి తీసుకొచ్చి ఆందోళన చేపట్టారు. ఎనిమిది రోజుల బాలింత అయిన మృతుడి భార్య పసిబిడ్డతో నిరసన తెలిపింది. సమీప గ్రామాల ఆదివాసీలు కూడా పెద్ద ఎత్తున తరలివచ్చి మద్దతుగా నిలిచారు. పోలీసులు అమాయకుడిని పట్టుకుని కాల్చి చంపారని ఆరోపించారు. వీరి ఆందోళనకు సామాజిక కార్యకర్త బేలా భాటియా మద్దతు తెలిపి ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బైరంగఢ్ ఎస్‌డీపీఓ మాట్లాడుతూ రమేష్ మావోయిస్టు పార్టీలో చురుగ్గా పని చేస్తున్నాడని, మాడ్ అడవుల్లో జరిగిన ఎదురు కాల్పుల్లో మృతి చెందాడని పేర్కొన్నారు. ఆదివాసీలు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

■ చంద్రుగొండ (మం॥) తిప్పనపల్లి గ్రామంలో విజయవాడ హైవే మీదుగా 17 గుంటల స్థలం అమ్మకమునకు కలదు. వివరాలకు సంప్ర. 86887 04885. [M-1167621]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 945 945 3338 [G-824549]

Wanted

■ TRG యూప్ సంస్థలో పనిచేయటానికి అభ్యర్థులు కావలెను. మండలాల నుంచి. సెల్: 93819 63269. [M-1167622]

■ Wanted Driver (Innova Car)-1, Lady Receptionist-02, Intermediate Qualification @ Pulipati Prasad Group of Institutions, Khammam. ✆: 9700754999, 9700892999 [M-9996]

■ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని, వంట పని చేయుటకు, వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ. 20k ఫోన్ 8977639662/8977639663. [H-793685]

■ రామకృష్ణ గ్రూపు, (AP, న్యూ ఢిల్లీ No.1) శ్రీమంతుల ఇళ్లలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, ఇంటి / వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ.జీ: 15-21 వేలు, ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 92814 52838, 63010 53690 [B-1239071]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి
కేవలం
రూ. 500/-
మాత్రమే
(GST 5% అదనం)

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	9705444182
	9010299957
కొత్తగూడెం	9010223783
పాల్వంచ	9705444183
భద్రాచలం	9951602914
మణుగూరు	9705944416
సత్తుపల్లి	9652868642
మధిర	9949927792

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు ప్రారంభం

- అన్ని జిల్లాల్లోని సచివాలయాల్లో మొదలైన కార్యక్రమం
- తొలి రోజే పదివేల డాక్యుమెంట్లు జారీ

సాక్షి, అమరావతి: ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభమైంది. ×నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు×కార్యక్రమంలో పంపిణీ చేసిన 30.61 లక్షల ఇళ్ల స్థలాలను లబ్ధిదారుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు కన్వేయన్స్ డీడ్స్ కూడా ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు మొదలుపెట్టారు. తొలిరోజే పది వేల డాక్యుమెంట్లు జారీ చేశారు. ప్రభుత్వం తరఫున వీఆర్‌ఓలు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన ఆస్తిపై 10 సంవత్సరాల తర్వాత సంపూర్ణ శాశ్వత హక్కులు లభిస్తాయని దస్తావేజుల్లో పేర్కొన్నారు. ఇందుకోసం ఏ ప్రభుత్వ శాఖ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) పొందాల్సిన అవసరం ఉండదని స్పష్టంగా ముద్రించారు. స్థలానికి సంబంధించి చెల్లించాల్సిన అన్ని రకాల పన్నులను వారి పేరు మీద చెల్లించుకోవచ్చని డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసిన ఆస్తిపై భవిష్యత్‌లో ఎటువంటి వివాదాలు, తగాదాలకు ఆస్కారం ఉండదని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్‌లో ఆ స్థలానికి ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ విలువ, భూసేకరణ ద్వారా ఆ భూమిని సేకరిస్తే ఉన్న విలువను కూడా ముద్రిస్తున్నారు. విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం పెద్దిపాలెంలో మొట్టమొదటగా తాతపూడి అప్పాయమ్మ పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారు. ప్రస్తుతం ఆ స్థలం ప్రభుత్వ విలువ రూ.4.46 లక్షలు కాగా, భూసేకరణ విలువ రూ. 11.61 లక్షలుగా అందులో పేర్కొన్నారు. ఈ రిజిస్ట్రేషన్ల కోసం చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీ, యూజర్ ఛార్జిలను ప్రభుత్వమే భరిస్తోంది. అప్పాయమ్మ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసిన రూ. 11.61 లక్షల విలువైన ఆస్తికి సాధారణంగా అయితే ఆమె రూ. 18,600 స్టాంప్ డ్యూటీ, రూ. 2,325 రిజిస్ట్రేషన్ ఛార్జి, రూ. 500 యూజర్ ఛార్జి కలిపి మొత్తం రూ. 21,425 చెల్లించాల్సి ఉంటుంది. దానిని ప్రభుత్వమే భరించింది.

15 రోజుల్లో రిజిస్ట్రేషన్లు పూర్తి..

పదిహేనురోజుల్లో 30.61 లక్షల పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అందుకనుగుణంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఏర్పాట్లు చేసింది. గురువారం నుంచి రిజిస్ట్రేషన్లను మరింత వేగంగా చేయనున్నారు. రిజిస్ట్రేషన్లు చేసిన తర్వాత ఆ డాక్యుమెంట్లను (కన్వేయన్స్ డీడ్స్) లబ్ధిదారులకు అందించనున్నారు. రూ. 10 స్టాంప్ పేపర్లపై ఈ డీడ్ల ప్రింటింగ్‌ను రిజిస్ట్రేషన్లు అయినదాన్ని బట్టి జిల్లాల్లోనే చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఫిబ్రవరి మూడో వారంలో ఈ కన్వేయన్స్ డీడ్స్ పంపిణీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఆ తర్వాత నియోజకవర్గాలు, సచివాలయాల స్థాయిలో ప్రజాప్రతినిధులు ఈ డీడ్స్‌ను పంపిణీ ఏర్పాట్లు చేస్తున్నారు.

6,100 పోస్టులతో డీఎస్సీ

సీఎం జగన్ నేతృత్వంలో కీలక నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోదం

టీచర్ అభ్యర్థులకు ప్రభుత్వం తీపి కబురు.. ఒకటి రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల



మంత్రి మండలి సమావేశంలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ ఉద్యోగార్థులకు ఏపీ ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. 6,100 పోస్టులతో మెగా డీఎస్సీ – 2024 రానుంది. ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలను పెంపొందిస్తూనే టీచర్ పోస్టుల ఖాళీల భర్తీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పాఠశాల విద్యాశాఖతో పాటు గిరిజన, సాంఘిక, బీసీ సంక్షేమ శాఖల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో సంపూర్ణ స్థాయిలో బోధన కొనసాగేలా భారీగా ఉపాధ్యాయులను నియమించనుంది. మహిళా సాధికారతే లక్ష్యంగా ఫిబ్రవరి 16న నుంచి చివరి విడత ×వైఎస్సార్ చేయూత×పంపిణీ చేపట్టనున్నారు. సుమారు 27 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మల ఖాతాల్లో ప్రభుత్వం రూ.5,060.40 కోట్లు జమ చేయనుంది. ఈ మేరకు బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ మీడియాకు మంత్రి మండలి నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

2.20 లక్షల శాశ్వత ఉద్యోగాలు!

మెగా డీఎస్సీ 2024లో భాగంగా ఒకటి రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేస్తాం. రాష్ట్రవ్యాప్తంగా 185 సెంటర్లలో 15 రోజుల పాటు డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తాం. అంతకంటే ముందు 8 రోజుల పాటు డీఎస్సీ అర్హత కోసం టెట్ పరీక్ష నిర్వహిస్తాం. డీఎస్సీ 2024 అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు 42 ఏళ్ల వయో పరిమితిని నిర్దేశించాం. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వయోపరిమితిలో ఐదేళ్ల సడలింపు కల్పించాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2019 నుంచి ఒక్క విద్యా రంగంలోనే 14,219 ఉపాధ్యాయ పోస్టుల భర్తీని చేపట్టింది. 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్ల విధానాన్ని తేవడంతో 7,761 పోస్టుల్లో కొత్త ఉపాధ్యాయులు చేరారు. డీఎస్సీతో పాటు అటవీ శాఖలో ఫారెస్టు రేంజర్లతో సహా వివిధ విభాగాల్లో 689 పోస్టులను ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నాం. ఇలా వివిధ శాఖల్లో కలిపి ఇప్పటికే 2.13 లక్షల శాశ్వత ఉద్యోగాలను కల్పించాం. తాజా నోటిఫికేషన్ల ద్వారా మరో 7 వేల పోస్టులతో కలిపి 2.20 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను అందించినట్లు అవుతుంది.

ఎస్‌ఈఆర్టీతో ఐబీ భాగస్వామ్యం..

పేదలకు, సంపన్నులకు తేడా నాణ్యమైన విద్య మాత్రమే. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో ఐబీ సిలబస్ తీసుకొస్తున్నాం. ఐబీ విద్యా విధానంలో చదవడానికి ఏడాదికి రూ.7 లక్షల నుంచి రూ.36 లక్షల దాకా ఖర్చవుతుంది. సంపన్నుల పిల్లలకు మాత్రమే అందుబాటులో ఉండే డిజిటల్ సదుపాయాలు, ఐఎఫ్‌పీలు, ట్యాబ్‌లను పేద పిల్లలకు కూడా అందుబాటులోకి తేవడంతో మార్పు మొదలైంది. దీన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ బోధనలో ఐబీని భాగస్వామ్యం చేస్తున్నాం. ప్రభుత్వంతో ఒప్పందానికి ఐబీ సంస్థ ముందుకు వచ్చింది. 2025–26 విద్యా సంవత్సరం జూన్ నుంచి ఒకటో తరగతి నుంచి ఐబీ మొదలవుతుంది. 2026–27 విద్యా సంవత్సరం నాటికి రెండో తరగతికి విస్తరిస్తాం. 2035 నాటికి పదో తరగతి, 2037 నాటికి ప్లస్ 2 తరగతి విద్యార్థులు ఐబీ బోర్డు జాయింట్ సర్టిఫికేషన్‌తో పరీక్షలు రాస్తారు.

మరికొన్ని అంశాలకూ ఆమోదం

- రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల్లో పని చేస్తున్న బోధనేతర సిబ్బంది పదవీ విరమణ వయసు 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పొడిగింపు.
- ప్రతి గ్రామ పంచాయతీకి పంచాయతీ కార్యదర్శి ఉండాలన్న నిర్ణయానికి ఆమోదం.
- ఏపీ డిస్కమ్‌లకు రూ.1,500 కోట్ల రుణాలపై ప్రభుత్వ గ్యారంటీ.
- అత్యంత మారుమూల ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో పర్టిక్యులర్ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్ (పీవీజీటీ) ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు రూ.89.98 కోట్లతో రూపొందించిన డీపీఆర్‌కు ఆమోదం.

ఇంధన రంగంలో భారీగా పెట్టుబడులు

రాష్ట్రంలో విండ్, సోలార్, గ్రీన్ ఎనర్జీ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తూ స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) ప్రతిపాదనలను మంత్రి మండలి ఆమోదించింది. ఇందులో భాగంగా గ్రీన్‌కో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 1,500 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుదుత్పత్తి ప్రాజెక్టుకు నంద్యాల జిల్లా గడివేముల మండలం చిన్నక్కపల్లెలో 1,272.07 ఎకరాలు, మిడ్తూరు మండలం మాసాపేట, నాగలూటి గ్రామాల్లో 1,011.44 ఎకరాలు, కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడలో అవసరమైన భూములను గుర్తించనుంది. సోలార్, విండ్‌తో సహా పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టులకు ఇండోసోల్ సోలార్ పవర్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు అవసరమైన భూములు కేటాయించేందుకు ఎస్ఐపీబీ ఏర్పాటు ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

మరికొన్ని స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు

- మూడు శాసనసభ, నాలుగు లోక్‌సభ స్థానాలకు నియామకం
- ఐదో జాబితా ప్రకటించిన విద్యాశాఖ మంత్రి బొత్స, ప్రభుత్వ సలహాదారు సజ్జల
- ఇప్పటిదాకా 59 శాసనసభ, 13 లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తల ఎంపిక పూర్తి



సాక్షి, అమరావతి: ఏపీలో మూడు శాసనసభ, నాలుగు లోక్‌సభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. ఆ వివరాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద బుధవారం సాయంత్రం వెల్లడించారు. వివిధ వర్గాల ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయానికి పట్టం కడుతూ.. సామాజిక న్యాయం చేస్తూ... యువతకు పెద్దపీట వేస్తూ ఐదో జాబితా తయారు చేసినట్టు ఈ సందర్భంగా వారు తెలిపారు. గత ఎన్నికల్లో నర్సరావుపేట లోక్‌సభ స్థానం నుంచి ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించగా.. ఇప్పుడు ఆ స్థానంలో బీసీ వర్గానికి చెందిన మాజీ మంత్రి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్‌ను ఎంపిక చేశారు. కాకినాడ లోక్‌సభ స్థానం సమన్వయకర్తగా చలమలశెట్టి సునీల్, మచిలీపట్నం లోక్‌సభ స్థానానికి అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, తిరుపతి లోక్‌సభ స్థానానికి ప్రస్తుత ఎంపీ మద్దిల గురుమూర్తిని నియమించారు. అరకు వ్యాలీ(ఎస్టీ) శాసనసభ స్థానం సమన్వయకర్తగా రేగం మత్స్యలింగం, సత్యవేడు(ఎస్సీ)కు నూకతోటి రాజేష్, అవనిగడ్డకు ప్రముఖ వైద్యుడు సింహాద్రి చంద్రశేఖరరావును నియమించారు. ఈ జాబితాతో కలిపి ఇప్పటివరకూ 59 శాసనసభ, 13 లోక్‌సభ స్థానాలకు కొత్తగా సమన్వయకర్తలను నియమించినట్టయింది. ఇప్పటిదాకా ప్రకటించిన శాసనసభ స్థానాల సమన్వయర్తల్లో 21మంది ఎస్సీలు, ముగ్గురు ఎస్టీలు, 17 మంది బీసీలు, నలుగురు మైనార్టీలు, 14మంది ఓసీలకు చెందిన వారు ఉన్నారు. 13 లోక్‌సభ స్థానాల్లో బీసీలు ఏడుగురు, ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ ఒకరు, ఓసీలు ముగ్గురు ఉన్నారు.

3 నుంచి తిరుమలలో ధార్మిక సదస్సు



తిరుమల: శ్రీ వేంకటేశ్వరస్వామివారి అనుగ్రహంతో భక్తుల్లో ఆధ్యాత్మిక భావవ్యాప్తి కోసమే తిరుమల ఆస్థానమండపంలో ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు ధార్మిక సదస్సు నిర్వహించనున్నట్లు టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ధార్మిక సదస్సు ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మరింతగా హైందవ ధర్మాన్ని, శ్రీవారి వైభవాన్ని వ్యాప్తి చేసేందుకు, చిన్నవయసు నుంచే చిన్నారుల్లో మానవతా విలువలను పెంచేందుకు టీటీడీ అనేక చర్యలు చేపడుతోందని తెలిపారు. దీన్లో భాగంగా ధార్మిక సదస్సు నిర్వహించి పీఠాధిపతులు, మఠాధిపతుల సూచనలు స్వీకరించి మరింతగా ధర్మ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఇప్పటివరకు 57 మంది పీఠాధిపతులు సదస్సుకు వచ్చేందుకు సమ్మతించినట్లు చెప్పారు. శ్రీవారి ఆలయం నుంచి ఏ సందేశం వెళ్లినా భక్తులందరూ ఆమోదించి ఆచరిస్తారని ఛైర్మన్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి మాజీ మంత్రి రావెల

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు దంపతులు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ సమక్షంలో కిషోర్ బాబు, ఆయన సతీమణి శాంతి జ్యోతి వైఎస్సార్‌సీపీలో చేరారు. అనంతరం ఆయన సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్న కలలను సీఎం జగన్ సాకారం చేస్తున్నారని తెలిపారు. సీఎం జగన్ బడుగు బలహీన వర్గాల వారి తరఫున నిలిచారని, సమాజంలో అసమానతలు రూపుమాపుతున్నారని అన్నారు. అందువల్లే వైఎస్సార్‌సీపీలో చేరానన్నారు.

నేను ఎన్నికల్లో పోటీ చేస్తానని సీఎం జగన్‌ను అడగలేదు. పార్టీ కోసం ఏలా సేవలందించమంటే అలా చేస్తానని చెప్పా. ఎలాంటి కండిషన్ లేకుండా పార్టీలో చేరాను. సీఎం జగన్ ఏ బాధ్యత ఇచ్చినా నిబద్ధతతో పనిచేస్తా. కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు సీఎం జగన్‌తో కలిసి ప్రయాణం చేస్తా అని చెప్పారు.

జిల్లా వార్తలు

ఐఎన్‌టీయూసీ కొత్త కమిటీలు రద్దు

సింగరేణి(కొత్తగూడెం): ఐఎన్‌టీయూసీలో పదేళ్లుగా పనిచేస్తున్న వారిని కాదని కొత్త వారితో ఇటీవల ప్రకటించిన నాలుగు ఏరియాల కమిటీలను అధినాయకత్వం రద్దు చేసిందని యూనియన్ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్, ఏరియా ఉపాధ్యక్షుడు ఆల్బర్ట్ తెలిపారు. కొత్తగూడెంలో బుధవారం వారు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఏఐటీయూసీని ఆరు ఏరియాల్లో గెలిపించిన కార్మికులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. కాగా, యూనియన్‌లో ఏళ్లుగా పనిచేస్తున్న వారికి ప్రాధాన్యత ఇవ్వకుండా సభ్యత్వం లేని వారికి పదవులు కట్టబెట్టడంతో కార్మికులు నిరసన తెలిపారని పేర్కొన్నారు. దీంతో ఆయా కమిటటీలను రద్దు చేస్తున్నట్లు యూనియన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ వెల్లడించారని, త్వరలోనే కొత్త కమిటీలను ప్రకటిస్తారని తెలిపారు.

శాశ్వత నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతలకు రశీదు ఇస్తున్న ఆలయ ఉద్యోగులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు బుధవారం విరాళం అందించారు. మియాపూర్‌కు చెందిన మల్లాది వెంకటసుబ్రహ్మణ్యం, విజయకృష్ణ రూ.లక్ష నగదును ఆలయ అధికారులకు అందించగా వారు దాతలకు రశీదు ఇచ్చి స్వామి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు సాయిబాబా, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారి మెరుగైతే రయ్ రయ్

- గుండాల మీదుగా మేడారం వెళ్తున్న భక్తజనం
- రోడ్డు సరిగ్గా లేక ఇబ్బందులు
- జాతరలోగానైనా పూర్తిచేయాలని వినతులు



లింగాల–పస్రా మధ్య రహదారిపై గుంతలు (ఇన్‌సెట్) ట్రాక్టర్‌లో మేడారం వెళ్తున్న భక్తులు

గుండాల: గిరిజన కుంభమేళాగా పేరున్న ములుగు జిల్లా మేడారంలోని సమ్మక్క – సారలమ్మ జాతరకు భక్తులు కొద్దిరోజులుగా వెళ్తున్నారు. జాతర జరిగే సమయాన రద్దీని దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే భక్తులు తల్లులకు మొక్కులు అప్పగించేందుకు వెళ్లివస్తున్నారు. ప్రధానంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల వారు ఎక్కువగా గుండాల మీదుగా పస్రా – నార్లాపురం నుంచి మేడారం చేరుకుంటారు. భక్తులు ఎక్కువగా ప్రైవేట్ వాహనాల్లో వెళ్తుండగా మార్గమధ్యలో రోడ్డు సరిగ్గా లేకపోవడంతో అవస్థ పడుతున్నారు. జాతర సమీపిస్తున్న నేపథ్యాన అధికారులు స్పందించి రోడ్డు వేయిస్తే ఈ మార్గంలో వెళ్లివచ్చే భక్తుల ఇక్కట్లు తీరనున్నాయి.

ఎంత దూరం..

గుండాల నుంచి 61 కి.మీ.ల దూరంలో మేడారం ఉంటుంది. ఆళ్లపల్లి మండలం నుంచైతే 80 కి.మీ.లు, ఇల్లెందు నుంచి గుండాల – పస్రా మీదుగా 121 కి.మీ.లు, కొత్తగూడెం నుంచి వయా ఇల్లెందు – గుండాల మీదుగా 140 కి.మీ.ల దూరం ప్రయాణించాలి. ఇక ఖమ్మం నుంచి వయా ఇల్లెందు, గుండాల వరకు 102 కి.మీ.లు, అక్కడి నుంచి మేడారం 61 కి.మీ.ల దూరంలో ఉంటుంది.

అర్ధంతరంగా నిలిచిన రోడ్డు పనులు

గుండాల నుంచి పస్రా 38 కి.మీ.ల దూరంలో ఉండగా.. మధ్యలో 10 కి.మీ.లు మినహా నూతనంగా బీటీ రోడ్డు నిర్మించారు. దీంతో ప్రయాణం కొంత సాఫీగానే సాగుతోంది. మరికొంత దూరం మెటల్ వేసి వదిలేయగా.. ఇంకో మరో ఐదు కి.మీ.ల మేర అసలు పనులే ప్రారంభించలేదు. ఫలితంగా ఇక్కడ



ఇటీవల కొంత మేర వేసిన బీటీ రోడ్డు

వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పూర్తిగా అడవి మార్గం కావడం.. రోడ్డు బాగా లేకపోవడంతో వాహనం ఎక్కడ ఆగిపోతుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది. ఐదు కి.మీ.ల మేర పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. కొద్దిరోజుల నుంచి హన్మకొండ డిపో నుంచి గుండాల మీదుగా మేడారానికి బస్సు సర్వీస్ ప్రారంభించారు. అలాగే, ఇల్లెందులో డిపో అధికారులు సైతం గుండాల మీదుగా ఓ బస్సును వారానికి రెండు రోజుల పాటు నడిపిస్తామని ప్రకటించినా మధ్యలో ఆపేశారు. దీనికి ప్రధాన కారణం రహదారి బాగా లేకపోవడమేనని తెలుస్తోంది. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారిని మరమ్మతు చేయించాలని భక్తజనం కోరుతోంది. అంతేకాకుండా ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, ఇల్లెందు డిపోల నుంచి మేడారానికి ప్రత్యేక బస్సులు నడపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గుండాలలో బస

దూర ప్రాంతాల నుంచి మేడారం వెళ్తున్న భక్తులు గుండాల సమీపంలో బస చేస్తున్నారు. మార్గమధ్యలోని జామరగూడెం వద్ద సమ్మక్క – పగిడిద్దరాజును దర్శించుకుని వెళ్తున్నారు. ఇల్లెందు, ఖమ్మం, కొత్తగూడెం, టేకులపల్లి, కొత్తగూడెం తదితర మండలాల నుంచి ప్రైవేట్ వాహనాల్లో వెళ్తున్న వారి సంఖ్య పెరుగుతున్నందున మిగిలిపోయిన 5 కి.మీ.ల రోడ్డును జాతరలోపు అయినా మరమ్మతు చేయించాలని వారు కోరుతున్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి



మేడారం జాతరకు గుండాల మీదుగా భక్తులు అధిక సంఖ్యలో వెళ్తున్నారు. లింగాల నుంచి పస్రా వరకు రోడ్డు పనులు ప్రారంభించిన అధికారులు మధ్యలో వదిలివేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. త్వరలో జాతర ప్రారంభం కానున్నందున అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.

–పూనెం మంగయ్య, దేవళ్లగూడెం

ఆలయాల భూముల్లో అక్రమాలపై కఠినచర్యలు

ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సులోచన



ఆలయ భూమిలో తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంగాంధీచౌక్: దేవాలయాల భూముల ఆక్రమణలు, అక్రమాలను సహించేది లేదని ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎ.సులోచన హెచ్చరించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని పలు ఆలయాలకు సంబంధించి భూముల విషయంలో అక్రమాలు జరుగుతున్నట్లు సమాచారం అందిందని తెలిపారు. ఈ సందర్భంగా కూసుమంచి మండలం జీళ్లచెరువు శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం భూములను బుధవారం ఆమె పరిశీలించారు. సదరు భూముల్లో తవ్వకాలు జరిగినట్లు గుర్తించగా.. పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఆలయ భూముల్లో తవ్వకాలు జరగకుండా, ఎవరూ ఆక్రమణలకు పాల్పడకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ వెంట ఖమ్మం దేవాదాయ శాఖ పరిశీలకురాలు ఆర్.సమత తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీదే విజయం

మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు



మాట్లాడుతున్న రామచంద్రరావు

చుంచుపల్లి: ఖమ్మం – నల్లగొండ – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరగనున్న ఎన్నికల్లో బీజేపీకే గెలుపు అవకాశాలు ఉన్నాయని మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు అన్నారు. కొత్తగూడెంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ అధ్యక్షతన బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో రామచంద్రరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేసే పరిస్థితి లేకపోవడంతో ఆ పార్టీపై ప్రజల్లో నమ్మకం పోతోందన్నారు. ప్రజలను మోసం చేయడంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఒకటేనని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందన్న కాంగ్రెస్ నేతలు ఇప్పుడు మాట్లాడకపోవడంతో ఆ పార్టీ తీరు అర్థమవుతోందన్నారు. కాగా, అయోధ్యకు వెళ్లే రామ భక్తుల సౌకర్యార్థం ఈ నెల 5 నుంచి మార్చి 5 వరకు ఆస్థా పేరుతో రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లు నడిపిస్తుందని తెలిపారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 10 నుంచి విజయ సంకల్ప యాత్ర పేరుతో బస్సుయాత్రలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, నాయకులు కాసం వెంకటేశ్వర్లు, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, చింతలచెరువు శ్రీనివాసరావు, తాటిపాముల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆరు నెలల్లో కాపు



ఆయిల్‌పామ్ మొక్కను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త ప్రసాద్, అధికారులు

సత్తుపల్లి: ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆరు నెలల్లోనే గెలలు వస్తాయని ఐఓపీఆర్ శాస్త్రవేత్త ప్రసాద్ తెలిపారు. సత్తుపల్లి మండలం నారాయణపురంలో కాపుకు రాని ఆయిల్‌పామ్ తోటను బుధవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతు పుచ్చకాయల సోమిరెడ్డి 12ఎకరాల్లో నాటిన తోటలో కొన్ని చెట్లు చనిపోవడం, మరికొన్ని కాపుకు రాకపోవటంతో ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేయగా పరిశీలించారు. మంచిగా ఉన్న చెట్టు కూడా కింద పాడైతే దెబ్బతినే అవకాశం ఉన్నందున డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పలు దశల్లో బోరాన్, పొటాష్, మెగ్నీషియం అందించాలని సూచించారు. ఉద్యానవన శాఖాధికారి డీ.వీ.రమణ, ఆయిల్‌ఫెడ్ డీఓలు భారతి, బాలకృష్ణ, ఎస్‌ఓ రాజశేఖర్‌రెడ్డి, రైతులు పుచ్చకాయల సోమిరెడ్డి, తుంబూరు కృష్ణారెడ్డి, ఒగ్గు అప్పిరెడ్డి, వేంపాటి లక్ష్మీనారాయణ, తుంబూరు ఉమామహేశ్వరరెడ్డి, దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

సోషలిస్ట్ రాజ్యస్థాపన కోసమే 'మాస్‌లైన్'

- మూడు విప్లవ పార్టీలు విలీనం కానున్నాయి..
- వచ్చేనెల 3, 4, 5వ తేదీల్లో ఐక్యతా జాతీయ మహాసభలు
- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న పోటు రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలో సమసమాజం, నూతన ప్రజాస్వామిక, సోషలిస్ట్ రాజ్యం రావాలనే ఆశయంతో పనిచేస్తున్న పార్టీ సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ(ఎంఎల్) ఆర్ఐ, పీసీసీ సీపీఐ ఎంఎల్ ఐక్యతా జాతీయ మహాసభలు మార్చి 3, 4, 5వ తేదీల్లో ఖమ్మంలో నిర్వహిస్తున్న సందర్భంగా ఆహ్వాన సంఘం ఏర్పాటు సభ ఖమ్మంలోని రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా, పోటు రంగారావు మాట్లాడుతూ.. మతోన్మాదం, ఫాసిజం, నిరంకుశత్వం, అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీ ప్రజాపంథా అని తెలిపారు. లౌకిక, ప్రజాస్వామిక పౌరహక్కుల కోసం గొంతు విప్పుతూ ఎన్నో పోరాటాలు నిర్వహించామని చెప్పారు. ఈ క్రమం కొనసాగింపులో భాగంగా మూడు విప్లవ పార్టీలు విలీనం కానున్నాయని, 14 రాష్ట్రాల్లో పనిచేసే పార్టీలు ఒక అవగాహనకు వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా మార్చిలో నిర్వహించే ఐక్యతా జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ మూడు విప్లవ పార్టీలు విలీనం కానుండడంపై హర్షం వ్యక్తం చేస్తూ.. భవిష్యత్‌లో మరిన్ని పార్టీలు ఐక్యత వైపు అడుగులు వేయాలని సూచించారు.

ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా కృష్ణమూర్తి

ఖమ్మం వేదికగా మూడు రోజుల పాటు జరిగే మూడు విప్లవ పార్టీల ఐక్యతా జాతీయ మహాసభలకు ఆహ్వాన సంఘం ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షుడిగా న్యాయవాది వడ్డేల్లి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వి.మనోహర్‌రాజు, కోశాధికారిగా గోకినేపల్లి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, రాయల చంద్రశేఖర్, డాక్టర్ కె.జగదీశ్‌బాబు, పుసులూరి నరేందర్, వై.కృష్ణయ్య, పి.రవిమారుత్, కాకి భాస్కర్, రాయల రవికుమార్, చావా రమేశ్‌బాబు, చావా శ్రీహరి, నయీమ్, సత్యనారాయణ, ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. అలాగే, నగర ప్రముఖులు, మేధావులు, విద్యావేత్తలు, వైద్యులు, ప్రజాసంఘాల బాధ్యులు సభ్యులుగా వ్యవహరించనున్నారు.